# తెలుగు సామెతలు – సాంస్కృతిక జీవనం

డా॥ జి. ఝాన్సీరాణి
రీడర్, శాఖాధిపతి, తెలుగు శాఖ,
బాపట్ల ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, బాపట్ల.

శిష్టసాహిత్యం, జానపద సాహిత్యం అని సాహిత్యం రెండు రకాలు. శిష్ట సాహిత్యాన్ని పండితులు సృష్టిస్తే, సామాన్య జన జీవనం గడిపే పామరులు తమ వినోదం కొరకు మానసిక ఉల్లాసం కొరకు జానపద సాహిత్యాన్ని సృష్టించారు. ఎన్నోవర్గాల ప్రజల జీవన విధానానికి చిహ్నం ఈ జానపద సాహిత్యం. ప్రజల్లోంచి సహజంగా పుట్టి పెరిగిన ఈ జానపద సాహిత్యం ప్రజల జీవితంతో సామాజికంగా, సాంస్కృతికంగా పెనవేసుకుని ఉంటాయి. ఏ బాషలోనైనా జానపద సాహిత్యం యొక్క మూలాలను, ఆవిర్భావాన్ని కనుగొనడం అంత సులభం కాదు. భాష, సాహిత్యాల యొక్క పూర్వాపరాలను, పరిణామ వికాసాన్ని తెలుసుకోవడానికి జానపద సాహిత్యం ఎంతో తోడ్పడుతుంది. తెలుగు జానపద విజ్ఞానాన్ని పరిశోధకులు కొన్ని వర్గీరరణలు చేశారు. అవి -

**కథాసాహిత్యం** - నీతి కథలు, వీరకథలు, అద్భుత కథలు, వ్రత కథలు, పురాణ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పేరంటాలు కథలు మొదలగునవి.

**గేయ సాహిత్యం** - శ్రామిక గేయాలు, స్త్రీల పాటలు, శృంగార గేయాలు, బతుకమ్మ పాటలు, తుమ్మెద పాటలు మొదలగునవి.

**నాటక సాహిత్యం** - ఒగ్గు కథ, బుర్ర కథ, వీధి నాటకం, భామాకలాపం, తోలు బొమ్మలాట, భాగవతుల నాటకం మొదలగునవి.

**నాట్య సాహిత్యం** - కోలాటాలు, కురవంజి, భజనలు, గొల్లసుద్దులు మొదలగునవి ఇవేకాక జాతీయాలు, సామెతలు, పొడుపుకథలు మొదలగునవి జానపద సాహిత్యానికి సంబంధించినవే.

**సామెతలు :**

సామెతలనేవి దేశచరిత్రకు, జాతి సంస్కృతికి, మానవ నైజానికి అద్దం పడుతుంటాయి. దేవతల పుట్టుక, ఏరుల పుట్టుకలా సామెతలపుట్టుక కూడా తెలుసుకోవడం కష్టసాధ్యం. సామెతను ఆంగ్లభాషలో 'ప్రొవెర్బ్స్' అని, సంస్కృతంలో 'లోకోక్తి' అని, కన్నడంలో 'గాదె', 'నాణ్ణుడి' అని, తమిళంలో 'పళమొళి' అని మలయాళంలో 'పళం చోల్' అని హిందీలో 'కహానత్' అని వ్యవహరిస్తారు.

తెలుగుభాషకు వెన్నెముకలాంటి సామెతలు మన దైనందిన జీవితంలో ఒక భాగం వెనుకటి తరంలోని అధిక సంఖ్యాకులు ఏదో ఒక సామెతలు ఉపయోగించనిదే మాట్లాడేవారుకాదు. సామెతల సృష్టికర్తలు సామాన్యులు. అవి వారి అనుభవసారం నుండి మధింపబడ్డవి. ఏ భాషకైనా పరిపుష్టిని కలిగించేవి సామెతలు. సామెతలకు తెలుగులో లోకోక్తి, నానుడి మున్నగు అనేక పేర్లు ప్రాచుర్యంలో వున్నాయి.

సామెత కూర్పు ఒక్కరిదే అయినా అనుభవం మాత్రం అందరిదీ. ఒక సంపూర్ణ జీవితసారం మొత్తం ఒక సామెతలో ఇమిడి ఉంటుంది. అందుకే కాబోలు కన్నడ ప్రజలు సామెతను వేదంతో పోల్చారు. (గాదెవేదక్కె సమాన)

సామెతల్లో కొన్ని ఫక్కున నవ్వించేవైతే, కొన్ని వాడిగా, కొన్ని చురుక్కుమనేలా, కొన్ని సూటిగా గుచ్చుకునేలా ఉండి జనజీవనాన్ని ప్రతిబింబించే విధంగా వుంటాయి.

"మనుష్యులు పోయినా మాటలు నిలుస్తాయి. అని సామెత. ఒక అనుభూతి తీవ్రతచేత ఒక్కడెవడో ఒక మాటను కూర్పుచేస్తాడు. వివేకవంతమూ, వంజనా యుతము అయిన ఆమాట ప్రజామోదం పొంది, జన ప్రియమైన సామెతగా నిలిచిపోతుంది." అని వేదవతిగారు పేర్కొన్నారు.

## సామెత నిర్వచనం :

మనం చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా, పదునుగా, పోలికతో వ్యక్తపరచడానికి ప్రతి ఒక్కరికి ఉపకరించేది సామెత, సామెతను జోడించి చెప్పే మాట కచ్చితంగా మనసుకు హత్తుకుంటుంది. తమ మాటను బలపరచుకోవడానికే గాక ఎదుటి వారికి స్పష్టంగా అర్థం కావడానికి సామెతలు తోడ్పడతాయి. సామెతలు ఎక్కువగా సంప్రదాయబద్ధంగా, వివేకవం తంగా, సంక్షిప్తంగా ఉంటాయి. సామెత అను పదం "సామ్యత" నుండి వచ్చింది. వీటి ముఖ్యలక్షణం సామ్యము (పోలిక) ను చెప్పటమే దీనినే దృష్టాంతము అని అంటారు. అలంకారికంగా (ఉపమ, రూపకం, దృష్టాంతం) నూ, సూటిగాను, సంక్షిప్తంగాను ఉండే సామెతల వెనుక ఒక పరిపూర్ణ జీవిత సత్యం దాగి ఉం టుంది. " సామెతలు సంక్షిప్తంగానూ, వివేక వంతంగానూ ఉండే సాంప్రదాయక అభివ్యక్తులు " అని రోగర్ డి.అబ్ర హామ్స్ నిర్వచించారు.

సామెతల్లో ప్రాసతో కూడిన లయ ఉంటుంది. ఈలయ సామెతలను గుర్తుంచుకోవడానికి ఉపకరిస్తుంది. తక్కువ అక్షరాలతో గొప్ప భావాన్ని ప్రకటించే ప్రత్యేక సామర్థ్యం సామెతలకుంది.

## సామెతలపై కృషి :

ఎందరో పరిశోధకులు ప్రాంతాల వారీగా వేలకొద్ది సామెతలను సేకరించి, పరిశోధించి ప్రచురించారు. వారిలో చిలుకూరి నారాయణరావు గారి కృషి అభినందనీయం. వీరు లక్షకుపైగా సామెతలను సేకరిం చారు. మన దేశీయులే గాక విదేశీయులు కూడా వీటిపై చెప్పుకోదగ్గ కృషి చేసారు. వారిలో కెప్టన్ కార్ల్ వాండర్ గారి కృషి ఎనలేనిది. వీరు 3 వేలకు పైగా తెలుగు సామె తలను సేకరించి వాటిని ఆంగ్లంలోకి అనువదించారు. సామెతల్లోని వివిధ కోణాలపై ఎందరో విశిష్ట కృషి చేసారు. ఇతర జానపద విభాగాలతో పోలిస్తే సామెతలు వినో దంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తాయి.

## సామెతలు - ప్రాచుర్యం:

జాతి సంపదలో ఒక భాగమే సామెతలు. ప్రతిభాశక్తి, కల్పనాశక్తి కలిగి ఉన్న ప్రాచీనమానవుడు తన అనుభవ జ్ఞానంతో కొన్ని భావాలను వ్యక్తీకరించడానికి వేరే కొన్ని విషయాలతో పోల్చి మాట్లాడడం ప్రారంభిస్తే ఆ వాక్యాలే తదనంతర కాలంలో అనేకులు ఉపయోగించడంచేత అవి సామెతలుగా ప్రాచుర్యం చెంది ఉంటాయి. కాబట్టి సామెతల కాల నిర్ణయం దుస్సాధ్యం.

## సామెతలు -వర్గీకరణ :

మానవ మనుగడలో అడుగడుగునా అనుభవంలో వచ్చిన ప్రతి అంశము సామెతల్లో చోటుచేసుకుంటాయి. కుటుంబ జీవనం, సాంఘీక జీవనం, సాంస్కృతిక జీవనం, ప్రాకృతిక జీవనం ఇలా అన్ని కోణాల్లోనూ సామెతలు పుట్టి ప్రాచుర్యం చెంది భాషకు పరిపుష్టిని అందించాయి.

### I. కుటుంబ జీవనం :

మన భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యముంది. కుటుంబ సభ్యులమధ్య, బంధువుల మధ్యగల సంబంధాలకు సంబంధించిన అనేక సామెతలున్నాయి.

**అడగందే అమ్మయినా పెట్టదు**
**అమ్మపుట్టిల్లు మేనమామ దగ్గరా**
**అత్త ఒకింటి కోడలే**
**అత్తలేని కోడలుత్తమురాలు కోడలులేని అత్త గుణవంతురాలు**
**అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు**
**మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వి నందుకు**

అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు
కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకులు పుడతారు.
గృహానికి సంబంధించినవి
ఇంటగెలిచి రచ్చగెలువు
ఇంట్లో ఈగలమోత బయట పల్లకీమోత
ఇల్లలకగానే పండుగవుతుందా?
ఇంతబతుకుబతికి ఇంటివెనుక చచ్చినట్టు
ఇంటిని చూసి ఇల్లాలిని చూడు.

**II. సాంఘీక జీవనం :**

కుటుంబ జీవన పరిధికన్నా సాంఘీక జీవనపరిధి విస్తృతమైంది. సహజ వనరుల మధ్య, పరిపాలనాధికార పరిధిలో, వివిధ వ్యాపారాల మధ్య అనేక వృత్తులు నిర్వహిస్తూ ప్రజలు సామూహికంగా సాంఘీక జీవనంలో భాగస్వామ్యం వహిస్తూ జీవిస్తుంటారు.

1. వ్యవసాయ ఆధారిత సామెతలు :
   ఆరుద్రలో అడ్డెడు చల్లితే, పునాసకు పుట్టెడు
   చిత్తలో చల్లితే చిత్తుగా పండుతుంది.
   పండనినేల పదులకంటే పండే నేల కొంచెం చాలు
   రైతు దున్నితేనే రాజులకు అన్నము
   పాడిగుట్టు పంట రట్టు
   కలుపు తీసిన చేను కనుల పండుగ
2. వృత్తులకు సంబంధించిన సామెతలు :
   కూటికోసం కోటివిద్యలు
   సోదిచెప్తే సోదమ్మ, మంత్రమేస్తే తంత్రమేస్తే మంత్రగత్తె
   దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యడు
   కరణాన్ని, కంసాలని కాటికిపోయినా నమ్మరాదు
   కోమటికి లేమి కంసాలికి కలిమి ఉండదు
   పనిలేని మంగలి పిల్లి తల గొరిగినట్లు
3. వ్యాపారానికి సంబంధించిన సామెతలు :
   అమ్మబోతే అడవి కొనబోతే కొరివి
   కడుపు నిండిన బేరం
   దమ్మిడి ఆదాయంలేదు క్షణం తీరిక లేదు
4. ఆహారపు అలవాట్లకు సంబంధించిన సామెతలు :
   జిహ్వకోరుచి పుర్రెకోబుద్ధి
   అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో
   సద్దన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరుగదట
   ఏపాటు తప్పినా సాపాటు తప్పదు.
   పొరుగింటి పుల్లకూర
   తినబోతూ రుచిఅడిగినట్లు
   ఆకలి రుచెరుగదు నిద్రసుఖమెరుగదు.
5. వాతావరణానికి సంబంధించినవి :
   కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు
   ఆరుద్ర కురిస్తే ఆరుకార్తెలు కురుస్తాయి.
   అశ్విని కురిస్తే అంతానష్టం.
   ఏ ఎండ కాగొడుగు
6. వైద్యానికి సంబంధించినవి:
   రోగి కోరిందీ పాలే, వైద్యుడు చెప్పిందీ పాలే.
   ఉల్లి చేసే మేలు తల్లికూడా చేయదు.
   ఆరోగ్యమే మహాభాగ్యం
   పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదు.
   కొండనాలుకకి మందువేస్తే వున్న నాలుక వూడింది.
7. సంపదకు సంబంధించినవి:
   డబ్బుంటే కొండమీది కోతికూడా దిగొస్తుంది.
   ఐశ్వర్యానికి అంతంలేదు, దారిద్ర్యానికి మొదలు లేదు.
   అప్పుచేసిపప్పుకూడు.
   కలిమిలేములు కావడి కుండలు.
   సొమ్మొకడిది సోకొకడిది.
   సిరిరామోకాలొడ్డినట్లు
8. పురాణ, ఇతిహాసాలకు సంబంధించినవి:
   రామాయణంలో పిడకలవేట
   రామాయణం రంకు భారతం బొంకు
   రామాయణమంతా విని రామునికి సీత ఏమవుతుందన్నాడట.

9. స్థల విశేషాలకు సంబంధించినవి:

రామేశ్వరానికి పోయినా శనీశ్వరం తప్పలేదు.
కాశీకి పోయినోడు కాటికి పోయినోడు ఒకటే
దీనిభావమేమి తిరుమలేశా
తిరుపతి క్షౌరం
కాలితో నడిస్తే కాశీకి పోగలంగాని, తలతో నడిస్తే
తలవాకిలి దాటగలమా.

**III. సాంస్కృతిక జీవనం :**

విభిన్నజాతులకు విభిన్న సంస్కృతులుంటాయి మతం, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, కళలు, వినోదాలు, విలాసాలు, ఆటలు మొ॥ అందులో భాగాలే.

1. దైవసంబంధమైనవి :

తానొకటి తలిస్తే దైవమొకటి తలుచును
ఇంటికన్నా గుడి పదిలం
నారుపోసినవాడే నీరుపోస్తాడు
శివుడాజ్ఞలేనిదే చీమైనా కుట్టదు.
మొక్కబోయిన దేవుడెదురైనట్లు
దిక్కులేనివారికి దేవుడే దిక్కు
మంత్రాలకు చింతకాయలు రాలవు

2. కులసంబంధమైనవి :

బలవంతపు బ్రాహ్మణార్థం
యాదవకులంలో ముసలం పుట్టినట్లు
హరిదాసు కందరూ తనవారె

3. అలంకరణకు సంబంధించినవి :

స్త్రీకి సిగ్గే అలంకారం
జుట్టున్నమ్మ ఏ కొప్పైనా పెట్టొచ్చు.
చక్కనమ్మ చిక్కినా అందమే.
చీరసింగారించేసరికి ఊరు మాటుమణిగింది.

4. వివాహాలకు సంబంధించినవి :

ఊళ్లో పెళ్లయితే కుక్కలకు హడావిడి
పెళ్ళికి వెళుతూ పిల్లిని చంకను పెట్టుకెళ్ళినట్లు
కక్కొచ్చినా, కళ్యాణం వచ్చినా ఆగదు.
ఇల్లుకట్టిచూడు పెళ్ళి చేసి చూడు

5. నమ్మకాలకు సంబంధించినవి :

బిడ్డొచ్చినవేళ గొడ్డొచ్చిన వేళ
ఒక కన్ను కన్నూ కాదు ఒక్క కొడుకు కొడుకూ కాదు.
గతికితే అతకదు

6. మరణాలకు సంబంధించినవి :

చావుకబురు చల్లగా చెప్పినట్లు
వానరాకడ ప్రాణం పోకడ ఎవరికెరుక
బ్రతకని బిడ్డ బారెడు
ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది.

**IV. ప్రాకృతిక జీవనం :**

మనిషి ప్రకృతిలో ఒక భాగం. తన చుట్టూ ఉన్న ప్రకృతి వనరులను ఉపయోగించి జీవనం సాగిస్తాడు. ప్రకృతిలో భూమి, ఆకాశం, కొండలు, నదులు, అడవులు మొదలైన వాటిమీద ఆధారపడి తన జీవితాన్ని అనునిత్యం మెరుగు పరచుకుంటాడు.

సముద్రంలో ఆవగింజంత
వానలుంటే పంటలు లేకుంటే మంటలు
కొండను చూసి కుక్క మొరిగినట్లు
నక్కతోక తొక్కినట్లు
అడవికాచిన వెన్నెల
ఎంత చెట్టుకంతగాలి
పులిని చూసి నక్కవాతపెట్టుకున్నట్లు
ఏరుదాటినాక తెప్పతగలేసినట్లు
కుక్కకాటుకి చెప్పుదెబ్బ

సామెతలు జనప్రియ సామెతలు, గ్రంథస్థ సామెతలు అని రెండు రకాలు. పైన పేర్కొన్న జనప్రియ సామెతలే కాక గ్రంథస్థ సామెతలు కూడా బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటిల్లో కొన్ని

నన్నయ : గతకాలం మేలు వచ్చుకాలము కంటెన్
వృద్ధుల బుద్ధులు సంచలింపవే
లేడి కడుపున పులి పుట్టునే

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

| | | |
|---|---|---|
| నన్నెచోడుడు | : | ఎలుక మీది కోపమున నిల్లేర్చి నట్లు. |
| ఎఱ్ఱన | : | కుంపటిలో తామర మొలిచిన క్రియ<br>నిప్పున ( జెదలంటునే |
| పోతన | : | ఊరకరారు మహాత్ములు |
| చేమకూర వేంకటకవి | : | చదువబెట్టగ ఉన్నమతియు బోయె |
| వేమన | : | తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు<br>కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా<br>చిత్తశుద్ధిలేని శివపూజలేలరా |

ఏభాషలోని సామెతలయినా అవి ప్రజల ఆలోచనలకు, ఆశయాలకు ప్రతిబింబాలు. అందుకే ప్రాచీన కాలంలోనే సామెతల ప్రయోజనాన్ని ఎందరో మహా మహులు గుర్తించారు. కాబట్టి ప్లాటో, అరిస్టాటిల్, ఏసు క్రీస్తు వంటి వారు ధార్మిక ప్రసంగాలలోను వీటిని సందర్భానుసారంగా వాడారు.

నిత్య జీవితంలో అంతర్భాగమైన ఈ సామెతల్లో కొన్నింటి యొక్క రూపురేఖలు కాలక్రమేణా మారి పోతుండగా మరికొన్ని పూర్తిగా కాలగర్భంలో కలిసి పోతు న్నాయి. సామెతలు, జాతీయాలు వంటివి మన జాతి ఉమ్మడి సంపద. జాతి జీవన వికాసంలోని అనేక అను భవాల నుండి జాలువారిన బంగారు గనులు. వీటిని భద్ర పరచడమంటే వీటిని వినియోగించడం ఒకటే మార్గం. నేటి తరం వారికి వీటి అవసరాన్ని, వినియోగ విధానాన్ని తెలియజేయవలసిన బాధ్యత మన అందరిది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆంధ్రుల జానపదవిజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం
2. సామెత - సి. వేదవతి.
3. జానపద విజ్ఞాన వ్యాసావళి - జి. ఎస్. మోహన్

❀ ❀ ❀